క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ ఎన్నికల ప్రచారం

ముసునూరు: మండలంలోని చెక్కపల్లిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల, యూత్ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, గూట్రు రంగారావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు చెక్కపల్లిలోని న్యూ అంబేడ్కర్ కాలనీ వద్ద ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఊటుకూరులో సుధారాణి ప్రచారం



ఊటుకూరు(గంపలగూడెం): మండలంలోని ఊటుకూరులో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆలపాటి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి పాల్గొని తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసును గెలిపించాలని కోరారు. విపక్షాలు చెబుతున్న మాయ మాటల్ని నమ్మవద్దన్నారు. నెమలి దేవస్థానం చైర్మన్ కావూరి శశిరేఖ, ఉప సర్పంచ్ సంగీతం రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వేమిరెడ్డిపల్లిలో స్వామిదాసు ప్రచారం

విస్సన్నపేట: వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు శుక్రవారం మండలంలోని వేమిరెడ్డిపల్లి పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రచారం ప్రారంభమవుతుందని, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

విద్యా హక్కు చట్టంపై అవగాహన

తిరువూరురూరల్: విద్యా హక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ప్రచారం నిర్వహించారు. బడి బాట కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా చేపట్టిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. బాల్య వివాహాలు చేయవద్దని, వేసవిలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ నేర్పాలని, కంప్యూటర్ శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు రాంప్రదీప్, రాజేంద్రప్రసాద్, సుదర్శన్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్



తిరువూరు/గంపలగూడెం: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో గురువారం జరిపిన దాడుల్లో ముగ్గురు సారా విక్రేతలపై కేసులు నమోదు చేశారు. విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో సారా తయారీ, అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. తాతకుంట్ల తండాలో బాణావత్ ఉష నుంచి మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అమ్మిరెడ్డిగూడెంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి సారా తయారు చేస్తున్న గుంజి దశరథరావు, జమలయ్యలపై కేసు నమోదు చేశారు.

నేడు బీసీల ఆత్మీయ సమావేశం

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం కార్యాలయం ప్రాంగణంలో బీసీల ఆత్మీయ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి బీసీ సంఘాల నాయకులు, బీసీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు.

13న నూతన సామాజిక భవనం ప్రారంభం

మైలవరం: మైలవరం తిరువూరు రోడ్డులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన సామాజిక భవనం ఈ నెల 13న ప్రారంభించనున్నట్లు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త పాలక మండలి చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. మైలవరం, తిరువూరు రోడ్డు పక్కన దాతల సహకారంతో సుమారు రూ.20 లక్షలతో లయన్ సామాజిక భవనాన్ని ఆధునిక సౌకర్యాలతో నిర్మించారని తెలిపారు. మైలవరం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు రాజకీయ నేతల రంజాన్ శుభాకాంక్షలు





రంజాన్ ప్రార్థనల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు ; మైలవరంలో ప్రార్థనల్లో పాల్గొన్న సర్నాల తిరుపతిరావు





తిరువూరులో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు తదితరులు ; తిరువూరు ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు

తిరువూరు: రంజాన్ పర్వదినాన్ని తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లోని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముస్లిం మత పెద్దలు రంజాన్ ప్రాధాన్యతను వివరించారు. ముస్లింలు తమకు తోచినంతలో దానాలు చేశారు. పలుచోట్ల రాజకీయ నాయకులు, ప్రముఖులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తిరువూరు ఈద్గాలో జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జామియా మసీదు ఇమాం మౌల్వీ రజ్వీ ఆధ్వర్యంలో రంజాన్ ప్రార్థనలు జరిగాయి. ముస్లింలకు పలువురు ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, పలువురు నాయకులు రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. కౌసర్ మసీదు, బిలాల్ మసీదులలో కూడా రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

- ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, కృష్ణారావుపాలెం, ఎ.కొండూరు, కంభంపాడు తదితర గ్రామాల్లోని ముస్లింలు గురువారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాలలో మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చీమలపాడు మదీనా మసీదు ఇమామ్ షేక్ బషీర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఖురాన్ పఠనం పూర్తి చేసుకొని ప్రత్యేక తారబి నమాజ్‌లు చదివి అల్లాను ప్రార్థించాలన్నారు. ధనికులు నిరుపేదలకు సహాయ సహకారాలు అందించి ఆదుకోవడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని ఉద్బోధించారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని చెప్పారు. చీమలపాడు ఏఏఎంటీ దర్బార్‌లో పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఏఏఎంటీకే దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్, మసీదు ముతవల్లి మహమ్మద్ ఖాదర్ మోహీద్దీన్, జాఫర్ షరీఫ్, తాజ్‌ఖాదర్‌బాబు పాల్గొన్నారు.
- గంపలగూడెం: ఊటుకూరు, గంపలగూడెం, పెనుగొలను, గోసవీడు, వినగడప, జింకలపాలెం తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉపవాస దీక్షలు ముగిశాయి.
- ఆగిరిపల్లి: స్థానిక జామియా మసీదు ప్రాంగణంలో ఈద్గా వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలను మత గురువులు మకరం హుస్సేన్, కలాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈదర, శోభనాపురం, నెక్కలం గొల్లగూడెం, కొత్త సురవరం గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నం మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, నాయకులు పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మత గురువు తౌఫిక్‌రజా నమాజు చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జోగి రాము, మొగిలి దయాసాగర్, నల్లమోతు ప్రసన్న బోసు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: రంజాన్ వేడుకలను గురువారం ముస్లింలు పట్టణంలో, మండలంలో భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. పట్టణంలోని మైలవరం రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అల్లా దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మండలంలోని బోర్వంచ, మీర్జాపురం, తుక్కులూరు, మొర్సపూడి తదితర గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కౌన్సిలర్ నడకుదురు గిరీష్, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ యూనస్‌పాషా (గబ్బర్) పాల్గొన్నారు.

- చాట్రాయి: మండలంలోని చనుబండ, సూరంపాలెం, తుమ్మగూడెం, నరసింహారావుపాలెం, కొటపాడు సోమవరం, మర్లపాలెం, పోలవరం గ్రామాల్లోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. నమాజు అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
- రెడ్డిగూడెం: రెడ్డిగూడెం, రాఘవాపురం, మద్దులపర్వ, ముచ్చనపల్లి, కుదప గ్రామాల్లో గురువారం ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు మౌతాసీమ్ రంజాన్ ప్రాధాన్యతను వివరించారు.
- మైలవరం: క్రమ శిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండుగ అని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతి రావు అన్నారు. స్థానిక డౌన్ సెంటర్‌లోని ఈద్గాలో జరిగిన నమాజులో ఆయన పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: మండల వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ఆయా గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విస్సన్నపేటలో జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆగిరిపల్లి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఊటుకూరులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



నూజివీడు ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చీమలపాడు ఈద్గాలో ప్రార్థనలు

సామాజిక న్యాయ సాధనకు పోరాడిన పూలే

ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. కొండపల్లిలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిరుపతిరావు మాట్లాడుతూ మహిళా విద్య ప్రోత్సాహానికి పాఠశాలలు స్థాపించారని చెప్పారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, సామాజిక అభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. వివిధ విభాగాల నాయకులు మిక్కిలి శరభయ్య, గుంజా శ్రీనివాస్, బొంత సాంబశివరావు, ఎస్. శివశంకరరావు, నల్లమోదు లక్ష్మీ, కె.గురవయ్య, లంకే అంకమోహనరావు, పోరంకి శ్రీనివాసరాజు, ఆనంద్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో...

తిరువూరు నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బోస్ సెంటర్లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు దండుగుల శివశంకర్, బత్తుల వెంకట్, గోపాల నాగేశ్వరరావు, మాయిరి వెంకటరమణ, యాసారపు శ్రీనివాసరావు తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ కార్యాలయంలో, ఐడియాస్ సేవా సంస్థల్లో కూడా పూలే జయంతి నిర్వహించారు.

- తోటమూల(గంపలగూడెం): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే విశేషంగా కృషి చేశారని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. గంపలగూడెం మండలం తోటమూల వై-జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ బీసీ విభాగం ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు ఇమ్మడి నరసింహారావు యాదవ్, ఆడెపు శ్రీనివాసచారి, జక్కుల కృష్ణ, ఎ. కోటేశ్వరరావు, గొర్రాజు నాగరాజు, శంకరాచారి, నాయకులు పాల్గొన్నారు.
- రెడ్డిగూడెం: రెడ్డిగూడెం వైఎస్సార్ సీపీ మండల పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ పూలే సేవలను కొనియాడారు. వివిధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఉయ్యూరు భరత్ కుమార్‌రెడ్డి, చాట్ల రాబర్టు, బత్తుల శ్రీనివాసరెడ్డి, ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి, పైడిమర్ల కిరణ్‌కుమార్‌రెడ్డి, షేక్ బుడే సాహెబ్, బత్తుల నాగిరెడ్డి, బొమ్మిన రాజేష్, షేక్ బాబా వలీ పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు పూలే..

మైలవరం: అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని అన్నారు.



నూజివీడులో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



కొండపల్లిలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తిరుపతిరావు, నాయకులు



తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న స్వామిదాసు, నాయకులు



రెడ్డిగూడెంలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి తదితరులు



మైలవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యతోనే సామాజిక అభ్యున్నతి

తిరువూరు: బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం సాధించేందుకు జ్యోతిరావు పూలే ఎంతగానో కృషి చేశారని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో గురువారం పూలే చిత్రపటానికి స్వామిదాసు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చదువుతోనే సామాజిక అభ్యున్నతి సాధ్యపడుతుందని నమ్మిన పూలే ఉచిత విద్యను అందరికీ అందుబాటులో తీసుకు వచ్చేందుకు పోరాడారని వివరించారు. తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్ వెంకటేశ్వరి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, వివిధ విభాగాల నాయకులు రేగళ్ల మోహన రెడ్డి, చలమాల సత్యనారాయణ, గత్తం నాగేశ్వరరావు, పరసా నెహ్రూజీ, గజ్జల సీతారామారావు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త పూలే

నూజివీడు: సమాజంలో కులవ్యవస్థ నిర్మూలనకు, సమ సమాజ స్థాపనకు జ్యోతిరావు పూలే ఎంతగానో కృషి చేశారని, స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పించాలని కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రతాప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ రామెళ్ల రంగారావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్ తదితరులు పాల్గొన్నారు.

- చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో పూలే జయంతి కార్యక్రమం జరిగింది. పూలే చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పూలమాల వేసి నివాళులర్పించారు.
- ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో పూలే చిత్రపటానికి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లాము రాజశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చిమట శ్రీనివాసరావు, నెరుసు రాజేష్, దొండపాటి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: స్థానిక వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో పూలే చిత్రపటానికి జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, వైస్‌ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, వివిధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళుర్పించారు. ఐక్యవేదిక నాయకులు కొండా రాజ్‌కుమార్, గొర్రె లాజరస్, పల్లెపాం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.
- ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ప్రధాన గేటు వద్ద విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

పొత్తు ధర్మానికి తూట్లు

- టీడీపీ తీరుపై జనసేన నాయకుల ఆగ్రహం
- బయటపడిన ఉమ్మడి పార్టీల పొత్తు విభేదాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో విభేదాలు తలెత్తాయి. మైలవరం నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ తీరుపై జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాలపై నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ)కి సమాచారం ఇవ్వకుండా కింది స్థాయి నాయకులకు సమాచారం ఇవ్వడంపై ఆ పార్టీ నేత చెరుకుమల్లి సురేష్ గురువారం తన ఫేస్‌బుక్‌లో ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టారు. కొండపల్లిలో ఉండే ఇన్‌చార్జ్ గాంధీకి ఇక్కడ కార్యక్రమాలపై సమాచారం ఇవ్వకపోతే ఇంకెక్కడి పొత్తు ధర్మం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస సమాచారం ఇవ్వకపోవడంపై టీడీపీ నేత చుట్టుకుదురు శ్రీనివాస్‌పై ఫోన్‌లో విరుచుకుపడ్డారు. కాపు నాయకులు, కాపు ఓటర్లతో పనిలేదన్నట్లు వసంత కృష్ణప్రసాద్ వ్యవహారం ఉందన్నారు. ఇలా అయితే ఎన్నికల్లో టీడీపీకి సహకరించేది లేదని తెగేసి చెప్పారు.

నేడు అవగాహన సదస్సు

మైలవరం: వివిధ పోటీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఓల్డ్ పెన్షనర్స్ భవనంలో విజయం సాధించడం ఎలా అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ముఖ్య వక్తగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు హాజరవుతారని తెలిపింది.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెక్కలం గొల్లగూడెం, కనసానపల్లిలో నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో గురువారం కవాతు నిర్వహించారు. సీఐ రామకృష్ణ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు వేయాలని, ఓటర్ల భద్రతకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేంద్ర కుమార్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి హీల్ అవయవ కేంద్రంలో ఐదుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చేతులమీదుగా గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కృత్రిమ అవయవాలు దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. కృత్రిమ కాళ్లు అందించేందుకు ఆర్థిక సాయం అందజేసిన దాతలు వల్లభనేని లక్ష్మీ కమల, మనోజ్ కుమార్, శివ నాగేంద్రమ్మ లను ఆయన అభినందించారు. అనంతరం హీల్ పాఠశాలలో కోస్టల్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మీ, బి.సులేఖ, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, కృత్రిమ అవయవకేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేసిన వేణుగోపాల్‌రెడ్డి

ఆలయ హుండీ కానుకల చోరీ

తిరువూరురూరల్: మునుకుళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం తెల్లవారు జామున చోరీ జరిగింది. ఆలయ మెస్ విరగ్గొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు హుండీని పగులగొట్టి భక్తులు వేసిన కానుకలను అపహరించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో ఉపాధి కూలీ మృతి

రామచంద్రాపురం(వత్సవాయి) : పాముకాటుతో ఉపాధికూలీ మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మేకల ముత్తయ్య (56) గురువారం ఉపాధి పనులు చేస్తుండగా, పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అప్రమత్తమైన తోటి కూలీలు ముత్తయ్యను జగ్గయ్యపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం ముత్తయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ముత్తయ్య కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని ఏపీఓ ఎన్. ప్రమీల తెలిపారు.